# వెర్రి

నిజంగా గొప్పవాళ్ళు గొప్పవాళ్ళలాగ కనపడరే కనపడరట. అన్నీవున్న విస్తరి అణిగిమణిగి ఉంటుందంటారే అలాగే ఉంటారుట. అదేమో నాకు కచ్చితంగా తెలియదు. కానీ -

నడమంత్రపు సిరి నరుడిని నిలవ నివ్వదంటారే, అలాగే తెచ్చిపెట్టుకున్న గొప్పతనం మనిషిని సహజంగా ప్రవర్తించనీయదని మాత్రం నేను బాగా చెప్పగలను. కారణం కిరణ్ కుమార్.

కిరణ్ నిన్నటివాడూ మొన్నటివాడూ కాడు. ఎలిమెంటరీ స్కూలు నుంచీ కలిసి చదువుకున్నాం. ఓ నలుగురు స్నేహితులని - ఉద్యోగం కానీ పరిస్థితులు కానీ విడివిడిగానూ చేసీ విసిరివెయ్య లేకపోయాయి.

అందరూ సమానమే అయినా కొందరు ఎక్కువ సమానం అన్నట్లు స్నేహితులే అయినా అందరూ వొకేలా ఉండరు. కొందరు విభిన్నంగా ఉంటారు.

అయ్యే చెట్టు ఆకులలోనే తెలుస్తుందన్నట్లు కిరణ్ ఎటువంటివాడు కాబోతాడో హైస్కూలు దశలోనే మాళ్ళమవుతూ వొచ్చింది కొంచెంగా. అతని అసలు పేరు వీరవెంకట సత్యన్నారాయణ ఐతే - అ చాలా మోటుగానూ చవకబారుగానూ వుందనీ గొప్పగా లేదనీ యింట్లో అల్లరి పెట్టేవాడుట పేరు మార్చేసుకుంటానని.

వాళ్ళ నాన్నగారు మమ్మల్ని పిలిచి లబోదిబోమన్నారు. "తాతపేరు, దేముడి పేరు సర్వమూ కలసి వొచ్చేలా శుభప్రదమయిన పేరు పెట్టాం నామకరణ మహోత్సవం ఘనంగా జరిపించి. గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందని యిప్పుడు వీడు మేము పెట్టిన పేరు బాగులేదని వంక పెడుతున్నాడు. పేరు మార్చుకుంటానంటున్నాడు. మీరయినా నచ్చచెప్పండి నాయనా. ఆ మాటకొస్తే పేరులో ఏముంది? పైడన్నా బంగారమే సువర్ణమన్నా బంగారమే."

మా శాయశక్తులా మేము ప్రయత్నించాం. కాని - వాడి మనసునీ పట్టుదలనీ ఏమాత్రమూ మార్చలేకపోయాం. నానా పుర్రాకులూపడి అగాడు తన వీరవెంకట సత్యన్నారాయణా నామధేయాన్ని కిరణ్‌కుమార్‌గా మార్చుకున్నాడు. గజిట్ నోటిఫికేషనూ తెప్పించుకున్నాడు. అలాగ పేరు మార్పిడిలో అతను కొందరు స్నేహితులని కోల్పోయాడతి స్వల్ప కారణంగా.

అంతవరకూ వీరా అనో వెంకట్ అనో సచ్చెం అనో నారాయణా అనో పిలిచే వాళ్ళకి ఒక్కసారి అదే మనిషిని కిరణ్ అని పిలవడమంటే కష్టమే. కాని అతనది సహించలేదు. తలనెవరయితే కిరణ్ అని కాక పాత పేరుతో పిలిచేవారో వాళ్ళందరి స్నేహాన్నీ వొదిలేశాడు. మాటలు మానేశాడు.

మనుషులని దూరం చేసుకున్నాడు కావాలనీ చేతులారానూ. అతని బలహీనతను -లేదా- వెర్రిని-అర్థం చేసుకోగలగడమే కాకభరించనూ భరించ గలిగే ముగ్గురం మాత్రం అతని స్నేహితులుగా మిగలగలిగాం నేటివరకూ. భరించామంటే అర్థం మాకు వొళ్ళు మండేది కాదని ఎంతమాత్రమూ కాదు. మా వొళ్ళు మంటని అతని ముందు బయటపెట్టే వాళ్ళం కామంతే.

ఏ వేలో కాలి బర్నాల్ రాసుకున్నా కిరణ్ గొప్పగా "శావ్‌లాన్" రాసుకున్నాననేవాడు. (అతని దృష్టిలో బర్నాల్ తక్కువా, పేరు మృదువుగా ఉంది కనుక శావ్‌లాన్ ఎక్కువా!)

ఏ విందు భోజనంలోనో కూర్చుంటే అతను తన గొప్పతనాన్ని ప్రదర్శించుకుందుకు మరీ

తాపత్రయ పడేవాడు.

అందరూ అప్పడం అంటే తనేమో పాపడ్ అనేవాడు. వడ్డించేవాడు అర్థం కాక – "నా పేరు పాపడు కాదండీ రామారావ్" అంటూనే మేము సర్దిచెప్పేవాళ్ళం. అప్పడం ఎర్రగా వేగితే – "ఛీ! మరీయింత డీప్‌గా వేపడమా!" అనేవాడు. తెల్లగా ఉంటే "అసలు వేగనేలేదు" అనేవాడు. అతన్ని చూసి చూసి మేమొకటి గ్రహించాం. ఏది ఎలావుంటే అలా కాక మరొకలా ఉండాలనడమే కిరణ్ దృష్ట్యా గొప్పతనం ఔతుంది.

అతని స్నేహితులమయిన మాకు ముగ్గురికీ కొంచె సాహిత్య సరదా వుండేది కనుక... మేం ముగ్గురమూ కథల గురించీ నవలల గురించీ మాట్లాడుకునే వాళ్లం. యువరక్తం కనుక సహజంగానే మమ్మల్ని విప్లవ రచనలూ... దిగంబర కవిత్వమూ... అడుగుబడుగు బతుకుల నవలలూ ఆకట్టుకొనేవి.

మేము వాటి గురించి మాట్లాడుకుంటూంటే కిరణ్ మాత్రం ముఖం చిట్లించుకుని మౌనంగా కూర్చునేవాడు. లేదా పనున్నట్లు వెళ్ళిపోయేవాడు. ఔను అతనికి – వెంకడు, కొండడు లాటి పేర్లున్న కథలు, నవలలు నచ్చవు. చదివే నవలలలో మోహన్, అజిత్, అరుణ్ వంటి పేర్లున్నవే ఉండేలా చూసుకొనేవాడు.

చదివే పుస్తకంలో కూడా తక్కువవీ అలగా పాత్రలూ ఉండకూడదతనికి. అంత ఎంపు పాటించేవాడు. మరీ విధిలేక చదవవలసివొస్తే ఆ పేర్లుగల పాత్రలు వొచ్చేసరికి ఆ పేజీలు తిప్పేసేవాడు. హంస, పాలను మాత్రం గ్రహించి నీటిని త్యజించేసేటట్లు. అలాంటి తక్కువ పాత్రలున్న నాటకాలూ సినిమాలూ కూడా సాధ్యమయినంత వరకూ నిషేధించేవాడు. అతనికి ఏదయినా గొప్పగా ఉండాలి... శబ్దమయినా దృశ్యమయినా... భావనయినా.

ఈ 'గొప్ప' వెర్రిలో పడే అతను 'కాల్‌టెక్స్'లో చేరాడు, అంత కంటే ఏభయి రూపాయిలెక్కువ జీతమిచ్చే కంపెనీలో కాక. ఆ కంపెనీ పేరు కాల్టెక్స్‌లా స్టయిలిష్‌గా ఉండదని. అంతటి ఘనుడు మా కిరణ్.

అతనెప్పుడేనా నాలుగు రోజులు కనపడక – "ఊరెళ్ళావా?" అంటే – "మరే, మెడ్రాస్ వెళ్ళా"నంటాడు. కాస్మోపాలిటన్ సిటీసూ... స్టేట్ క్యాపిటల్స్ తప్ప మామూలు ఊళ్ళు వెళ్ళానని చెప్పుకోడం కూడా అతనికి నామోషీయే.

అతను బొంబాయ్, మద్రాస్... కాల్‌కటా... డెల్హీ... హైదరాబాద్‌లు తప్ప సామాన్యమయిన కాకినాడ... రాజమెండ్రిలకి కూడా వెళ్ళడు.

ఎప్పటికేనా తన బలహీనతను తాను గమనించుకో లేకపోతాడా అని మిత్రులం ముగ్గురమూ ఆశ పడుతూండే వాళ్ళం. కాని... వేపకాయంత వెర్రీ పెరిగి పెరిగి గుమ్మడి కాయంత ఔతుందే కాని వెనక ముఖం పట్టడం లేదు.

'సేమ్యా' తింటాడు తప్ప – కిరణ్ – పరమాన్నం తినడు. (పరవాణ్ణం అనే పదం గొప్పగా ఉండదు సరికదా మోటుగా ధ్వనిస్తుంది మరి!) ఏదయినా అతనికి 'గ్రేట్‌గా' ఉండాలి. అందుకే కదా అతను బస్సు మీద వెళ్ళవలసివస్తే – పాసింజరు ఎక్స్‌ప్రెస్‌లను కూడా వొదిలేసి డీలక్స్ – సెమీలగ్జరీ... లగ్జరీ బస్‌లలో వెళ్ళేవాడు.

అటువంటి కిరణ్‌కి...గొప్పవాడికి...రాకూడని కష్టం వొచ్చిపడింది. అగ్ని పరీక్ష ఎదురయింది. సామాన్య దృష్టికి యిదేమీ కష్టమూ కాదు, అగ్ని పరీక్షా కాదు కాని... ఎంత చెట్టుకంతగాలి. పీత కష్టాలు పీతవి.

"ఏ వూళ్ళో ఉంటున్నారు?" అని అడిగితే – స్టయిలుగా "వాల్తేర్" అని చెప్పుకుందుకే యిక్కడ

మకాం పెట్టిన (కిరణ్ యీ వూరిని విశాఖపట్నం అనడు... వైజాగ్ అనీ అనడు. వాల్తేరనే అంటాడు గొప్పగా!) కిరణ్‌కి – సాలెపువాని పాలెం వెళ్ళ వలసి రావడమంటే... తల కొట్టేసినట్లే, దుర్భావమానమే, దుస్సహమే, పరువు ప్రతిష్టల ప్రశ్నే. ప్రిస్టేజి క్వశ్చనే.

ఈ పరిస్థితినతనెలా ఎదుర్కొంటాడో చూద్దామనే మేము ముగ్గురమూ బస్ స్టాండ్‌కి వెళ్ళాము. తల్లి పుట్టిల్లు మేనమామ కెరుకే అన్నట్లు కిరణ్ మనస్సులోని మధన మేము సరిగానే ఊహించగలం.

కండక్టర్ టికెట్ ఎక్కడికి కోయాలని అడిగితే – "సాలాపువాని పాలెం" అని చెప్పడమా ఇంత బతుకూ బతికి! అవూరి పేరు చెప్పాక కండక్టరు తననెంత చిన్న చూపు చూస్తాడు! తక్కువగా భావిస్తాడు. ఎలా భరించడం?

పాసింజరు బస్సు ఎక్కవలసి రావడమే పరువు తక్కువ. తప్పదు. సాలాపువాని పాలానికి ఎక్స్‌ప్రెస్ బస్‌స్టేజి లేదు. రిక్వెస్ట్ స్టాపు లేదు. అందుచేత పాసింజరు బస్సే గతి. విధి ఎంత బలీయమైనది!

కిరణ్ ఇలాగే ఆలోచిస్తుంటాడు. మేం ముగ్గురమూ ఎదురు చూస్తున్నాం ఆత్రంగా... కిరణ్ బస్ కండక్టరుకి 'సాలాపువాని పాలెం' అని చెప్పవలసి వొచ్చినపుడు అతని ముఖంలో ప్రదర్శించబడే కవళికలు దర్శిద్దామనీ, అతని మీద పగ తీర్చుకుందామనీ. పగెందుకంటే అతను తన గొప్పతనాన్ని ప్రదర్శించుకుందుకు మమ్మల్ని కూడా తక్కువసార్లు తక్కువ చేయలేదు గతంలో స్నేహం కొద్దీ భరించాము.

ప్లాట్‌ఫారం వద్దకు వచ్చింది అనకాపల్లి వెళ్ళే పాసింజరు బస్సు. మేము ముగ్గురమూ కూడా ప్రయాణీకులలాగే అతని వెనుక నిలుచున్నాం. కండక్టరు టికెట్ ఇస్తే కాని లోపలికి వెళ్ళనివ్వడం లేదు. కిరణ్ వంతు వచ్చింది.

"ఎక్కడికి?" అడగనే అడిగాడు.

మేము గుండెలు చిక్కబట్టుకుని ఉన్నాం – కిరణ్ జవాబు వినడానికి, అతని నోటివెంట సాలాపువానిపాలెం అనే మాట వినాలని.

కిరణ్ జవాబు విని – మేము తెల్లబోయాం.

అతను –

"సాలాపువానిపాలెం' అని చెప్పలేదు! అతనికి టాటా చెప్పేసి – మేము ఇవతలకి వొచ్చేశాం.

"ఎవరివెర్రి వాళ్ళకానందం. పుట్రెకు పుట్టిన బుద్ధీ వెర్రీ కూడా పుల్లలలో కాని పోవేమో. ఆ వెర్రిలో లాభనష్టాల సంగతి ఆలోచనలోకి రాదు"

"ఔను. అందుకే...ఆ వెర్రి కొద్దే... మరి కొంచెం పైసలెక్కువైతే అయ్యాయని అనకాపల్లికి టికెట్ తీసుకున్నాడు కిరణ్! – సాలాపువాని పాలెం అనే పల్లెటూరి పేరు తన నోట ఉచ్చరించడానికి కించపడి"

"టికెట్ అనకాపల్లికి తీసుకున్నా అతను దిగేదీ దిగవలసిందీ సాలాపువానిపాలెం దగ్గరే."

"వెర్రి వేయి విధాలంటారిందుకేనేమో"

ఓడిపోయిన వాళ్ళం – కసిగా మాట్లాడుకుంటూ నడవసాగాం. కిరణ్ ఎక్కిన బస్సు మమ్మల్ని దాటుకుంటూ వెళ్ళిపోయింది.

✡ ✡ ✡ ✡ ✡